# తపోభంగము

## ౧

ఘోరమైన తపస్సుచేస్తున్నాడు విశ్వామిత్రుడు త్రిలోకాధిపత్యం సంపాదించడానికి. ఆ తపోవేడిమికి చతుర్దశభువనాలూ అట్లు ఉడికినట్లు ఉడికిపోతున్నాయి. తపస్సు ఫలోన్ముఖమయ్యే సూచనలు కనబడుతున్నాయి.

దేవేంద్రుడు గడగడలాడిపోయినాడు. ఏమిచేయడానికి తోచలేదు. తన ఇంద్రత్వానికి ఎసరొచ్చింది. అప్సరసల్లోకల్లా అగ్రగణ్యురాలైన మేనకనుపిలిచి నా పరువునిలబెట్టమని మరిమరీ ప్రార్థించాడు.

"రాజకులానబుట్టి తపశ్శక్తిమూలాన బ్రహ్మత్వము సంపాదించిన మహానుభావుడు. సృష్టికి ప్రతిసృష్టిచేసిన జెగజెట్టి. మహాతేజస్వి. అయనకు కోపమువచ్చి ఒక్కసారి చూసినంతమాత్రాన సప్తసముద్రాలు ఇంకిపోవా? మూడులోకాలు కుమ్మరిసారెవలె గిరగిర తిరిగిపోవా? గాలిదేవుడు గట్టిగా వీచగలుగుతాడా? వీటికన్నిటికి తగినట్లు మహాకోపి' అలాంటి వాడివద్దకా నన్ను వెళ్ళమంటావు? వెళ్ళితేమాత్రం నాబోటివాళ్ళకు శక్యమా ఆ మహాత్ముడి తపస్సు చెరచడానికి? పైగాపోయి ఆయనకోపాని కెరగావడమే తప్ప లాభములేదు. ఒక్కొక్కరము ఎవళ్ళముపోయి ఆయనదృష్టి మరల్చలేము. కాదు కూడదంటావా? నాకుతగిన బలగాన్నంత సనుకూరుస్తే, నీ తిండితిని, నీ బట్ట కడుతున్నందుకు శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తాను" అన్నది మేనక.

"ఏమికావలెన"న్నాడు దేవేంద్రుడు.

మేనక తనతోబాటు అనిలుణ్ణి, వసంతుణ్ణి, మన్మథుణ్ణి తోడుచేసి ఇంకాకొందరు అప్సరసలనుకూడ పంపమన్నది.

దేవేంద్రుడు సరేనన్నాడు.

## ౨

హిమవత్పర్వత ప్రాంతారణ్యంలో తపస్సు చేస్తున్నాడు విశ్వామిత్రుడు. మేనక, అనిలుడు, వసంతుడు, మన్మథుడు, తక్కుంగల అప్సరోగణము ఆ అరణ్యం చేరారు విశ్వామిత్రుణ్ణి సమీపించారు.

ఆయనమొగమునుంచి బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతున్నది మనస్సు శ్రీమన్నారాయణమూర్తి పాదపద్మాల మీదఉంచి తదేకనిష్ఠతో ఇతరచింత ఏమీలేకుండా తపస్సుచేస్తున్న విశ్వామిత్రుణ్ణి చూసి తాము వచ్చినపని ఏలా సఫలమౌతుందా అని భయపడ్డారు వాళ్లు. అంతటి నిశ్చలత్వాన్ని తామెంతమందికలిస్తే మాత్రము చెఱచగలుగుతారు? లాభము లేదనుకున్నారు.

స్వామి యాజ్ఞకు బద్ధులై కర్తవ్యం ఆచరిస్తే అపైన భగవంతుడున్నాడని సమాధానము చెప్పుకున్నారు.

వసంతుడు తన ప్రతిభచూపాడు. అరణ్యమంతా చిగిర్చింది. పూలతీగెలనున్న పూలన్నీ వికసించినవి. ప్రకృతి నూత్నశోభను దాల్చింది. ఆకులసందునుండి కోకిలలు గొంతెత్తి గానముచేస్తున్నవి. ఈ నూతన పుష్పాల సౌరభాన్ని దక్షిణానిలుడు తపస్వికి అందించాడు.

అది విశ్వామిత్రుడు సమాధినుంచి లేచేవేళ. ఆయన కళ్ళుతెరిచిచూచాడు. అరణ్యమంతా కళకళలాడుతున్నది. ఏచెట్టున చూచినా ఎర్రనిచిగుళ్ళు. లేతపచ్చికరంగుగల ఆకులు తాకితే వాడిపోయేటట్లున్నవి. అన్నిచెట్ల చిగురుటాకులు ఎర్రగానే ఉన్నవి. కాని చెట్టును బట్టి చిగురుటాకుల ఎరుపు మారుతున్నది. మామిడిచిగుళ్ళ ఎరుపూ, వేపచిగుళ్ళ ఎరుపూ వేరువేరు. వేపచిగురు ఎరుపూ, చింతచిగురు ఎరుపూ వేరువేరు. కావడానికి అన్నీ ఎరుపులే అయినా మనుష్యుడు లెక్కపెట్టలేనన్ని మార్పులు అనేకరకాల వింతరంగులుకలిపి మానవచిత్రకారుడి ఊహకు అందజాలనీ ఒక విచిత్రమైన అందాన్ని అమర్చింది ప్రకృతి. ఈ రంగులమీద తన తెల్లనికిరణాలు ప్రసరింపజేసి ప్రకృతిలోని సహజకాంతిని రెట్టించాడు సూర్యుడు.

పూచినపూలన్నీ కమ్మనివాసనలు వెదజల్లుతున్నవి,

ఒక పూవుయొక్కవాసన, మరొకపూవువాసన ఒక మాదిరిగాలేవు. మల్లెకు ఒకవిధమయిన వాసన. గులాబికి మరొకవాసన. రెండూ కమ్మనివే.

కోకిలలన్నీ ఒకేస్థాయిన పాడుతున్నవి. ఒకే విధమయిన హాయిఉన్నది వాటిపాటలో. కాని పాడేవి వేరువేరు కోకిలలనీ, ఒకే కోకిలకాదనీ చెప్పవచ్చు. వాటిగొంతులలో లెక్కకుమించిన మార్పులున్నవి.

ఈ ఆలోచనలన్నీ ఒకదానివెనుక ఒకటి క్షణమాత్రంలో కలిగినవి. ప్రకృతిలోని సౌందర్యానికీ, దానిలోని అనంతమైన మార్పులకూ, ఎప్పుడూ ప్రకృతి మధ్యనే నివసించే విశ్వామిత్రుడే ఆశ్చర్యపోయినాడు. ఈ ప్రకృతికీ, కారణభూతుడైన శ్రీమన్నారాయణ మూర్తికీ మనసా నమస్కరించాడు.

ఇంతలో అందెలరవళి వినుపించింది. అటువైపు తన దృష్టి త్రిప్పాడు ఋషి సత్తముడు. అప్రక్కన దగ్గరలో మేనకాద్యప్సరసలు నాట్యము చేస్తున్నారు. పాటలు పాడుతున్నారు. ప్రకృతి సౌందర్యాన్ని తనివిదీర గ్రోలి ఇటుచూచేటప్పటికి సృష్టిలోని అందానికి మరోశాఖ దృగ్గోచరమైనది. వాళ్ళందరూ అందగత్తెలు. సమానమైన అందగత్తెలు. హెచ్చుతగ్గులు నిరూపించడానికి వీలేలేదు. కాని వారి అందాలు వేరువేరు విధాలు. ఒకఆమె అందము ఆమెకళ్ళలోనున్నది. అవి అతివిశాలములు. కాంతివంతములు. మరొకతె యందము ఆమె చెక్కిళ్ళలోనున్నది. ఇంకొకయప్సరస అందము ఆమె యవయవముల పొందికలోనున్నది.

ఇట్టి మనోహరమైన సృష్టికి మూలకందమయిన శ్రీమన్నారాయణమూర్తికి నమస్కరించాడు విశ్వామిత్రుడు.

ఈ దృశ్యాలురెండూ విశ్వామిత్రుని దృష్టిఃమార్చలేదు. పరమాత్ముని పాదపద్మములయందు లగ్నమైన ఆయనమనస్సు మరలలేదు. దీనిని చూచినా దానిమూలాన ఆయనకు భగవంతుడిమహిమే కనబడుచున్నది.

మేనక తక్కిన అప్సరసలను వదలి పూలుకోయనలెననే మిషమీద, ఒయ్యారంగా నడుస్తూ, పూలుకోసుకుంటూ విశ్వామిత్రునివైపు నడచినది. ఆమె యాతనివైపు చూడలేదు. విశ్వామిత్రుడికి మాత్రము ఆమె ప్రక్కవాటుగా కనబడుచున్నది. "ఈమె తక్కినవారికంటె చక్కనిదిసుమా!" అనుకున్నాడు విశ్వామిత్రుడు.

ఈ మాటలో పూర్వపునిశ్చలత్వము లేదు. సమయముకొరకు కనిపెట్టుకొనిఉన్న మన్మథుడు ఒక్కసారిగా వెయ్యిబాణాలు నాటాడాయన హృదయంలో మనిషిలో కొద్దికదలిక కలిగింది. ఆయన ఆమెవైపు చూశాడు. ఆమె అతిలోకసౌందర్యము ఆయనకు భగవన్మహిమ జ్ఞాపకము చేయలేదు.

మేనక విశ్వామిత్రుడివైపు వోరగాచూస్తూ పూలుగోస్తున్నది. దక్షిణానిలుడు సమయానికి పమిటతొలగించాడు. ఆమె నిండైన చనుకట్టు, ఉండి లేనట్టున్న నడుము కనుపించినవి. ఆ మనోహరరూపానికి ముగ్ధుడైనాడు.

దక్షిణానిలుడు సువాసనల గొనితెచ్చి ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేశాడు. అదేసమయంలో పంచబాణుడు తన ఐదుబాణాలు ఒక్కసారిగా ఉపయోగించి వెర్రెత్తించాడు.

చుట్టూ చూశాడు విశ్వామిత్రుడు. ప్రకృతిలోని అందముకూడా తనను తొందరచేస్తున్నది. చల్లనిగాలి, చక్కనిపూలు, హాయిఅయిన పాటలు, అందమయిన మేనక ఒకదానికొకటి సరిపోయినవనుకున్నాడు. ఇంతకంటె కోరతగినదిమాత్రము ఏమున్నది?

మహా తపశ్శాలియైన తనకే ఈ భావాలు వస్తున్నవేమి చెప్మా అనుకున్నాడు మౌనిశేఖరుడు. ఇంతకాలమునుంచి చేసినతపస్సు వ్యర్థముకాదా ఇలాటి భావాలకు చోటిస్తే?

ఈ ఆలోచనలు ఎక్కువసేపు ఆయన్ను కలవరపరచలేదు. సర్వమూ మరచిపోయిన ఆయనకు మేనక మాత్రమే మిగిలింది. దేవేంద్రుడి కోరికే సిద్ధించింది.

— మొదలి శీతారామస్వామి బి. ఏ.